క్లుప్తంగా

నేడు కనపర్రులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: కనపర్రులో విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ సందర్భంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

ఆధార్ నమోదు, సవరణలకు అవకాశం

బొల్లాపల్లి: ఆధార్ నమోదు, సవరణలకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వీఏ విజయకుమార్ మంగళవారం తెలిపారు. 27వ తేదీ వరకు మిగిలిన సచివాలయాల్లో ఆధార్ నమోదుకు సంబంధించి సవరణలు చేసుకోవచ్చని చెప్పారు. బొల్లాపల్లి, వెల్లటూరు, గుమ్మనంపాడు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తారని తెలిపారు. బుధవారం కనుమల చెరువు, మూగచింతలపాలెం, గరికపాడు గ్రామ సచివాలయాల్లో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. 25న రేమిడిచర్ల, పలుకూరు, అయ్యన్నపాలెం, 26న రావులాపురం, పేరూరుపాడు, మేళ్లవాగు, 27న గండిగనుమల, వడ్డెంగుంట, గుట్లపల్లి సచివాలయాలు, పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయని ఎంపీడీవో తెలిపారు.

ఎంపీయూపీ స్కూల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామం ఎంపీయూపీ పాఠశాల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాతా మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. మాతృభాష తెలుగులో అక్షరాలు రాయటం చదవటం, గణితంపై కూడికలు, తీసివేతలు, వెచ్చ వేతలు విద్యార్థులకు అర్థమయ్యేలా ఆటలు రూపంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొంతా ఫణికుమారి, జె.మునెయ్య పాల్గొన్నారు.

హాస్యకళాకారుడు జయప్రకాష్ మృతి



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ హాస్య కళాకారుడు కట్టెంపూడి జయప్రకాష్(71) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. వినుకొండ సీనియర్ న్యాయవాది వద్ద గుమస్తాగా చాలా కాలం పని చేశారు. నాటికలు రచించి, దర్శకత్వం వహించారు. అభినవ దుర్యోధన అనే హాస్య ఏకపాత్రాభినయాన్ని ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి అనేక మందిని తన హాస్యచతురతో ఆకట్టుకున్నారు.

వాకింగ్ స్టిక్స్, నడుము, నెక్‌బెల్టుల పంపిణీ

ఈపూరు: మండలంలోని వనికుంట గ్రామపంచాయతీలో ఎన్‌పీపీ సీఫ్ ఫ్లోరోసిస్ కార్యక్రమంలో భాగంగా వాకింగ్ స్టిక్స్, నడుము బెల్టులు, నెక్‌బెల్టులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనికుంట సర్పంచ్ బి.వి. సుబ్బయ్య, కొచ్చర్ల మెడికల్ ఆఫీసర్ డి.నాగేంద్రబాబు హాజరై ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి. గురుబ్రహ్మం, ఏఎన్ఎం కె. హైమావతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్‌బీ పురం పాఠశాలకు బంగారు పతకాలు



నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు పోటీలలో పాల్గొని ఐదు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం. పార్వతి మంగళవారం తెలిపారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఈనెల నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో పాఠశాలకు చెందిన పి.లావణ్య, ఎస్‌కె ఆసీఫ్, సి.హెచ్.మేరిమాతలకు షూటింగ్, రన్నింగ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. రేపల్లెలో జరిగిన క్యాంపులో పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎం.శివసాయిశేఖర్ తైక్వాండోలో, టి.జాన్‌పాల్ ట్రెక్కింగ్‌లో బంగారు పతకాలను గెల్చుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి, పీడీలు జీ.ఝాన్సీరాణి, ఎస్‌కె.ఫాతిమా, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వేధింపులపై కేసు నమోదు

ముప్పాళ్ళ: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని ఓ వివాహిత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముప్పాళ్ళ ఎస్సీ కాలనీకి చెందిన మాడుగుల కోటేశ్వరమ్మతో గుంటూరుకు చెందిన విజయసాగర్‌కు సుమారు ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. భర్త, అత్తమామలు తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో ఆమె పుట్టింటికి చేరారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు.

రెండో రోజు పాఠశాలల్లో శిక్షా సప్తాహం

- కళాత్మకంగా వస్తువులు తయారు చేసిన చిన్నారులు
- ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ డేగా...



నాదెండ్ల ప్రాథమిక పాఠశాలలో...

నాదెండ్ల: జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా మంగళవారం రెండో రోజు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ కార్యక్రమం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి కనపర్రు బీపీఆర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులచే కళాత్మకంగా తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. రెండో రోజు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ డేగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృథాగా ఉన్న కొన్ని పరికరాలతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో కళాత్మక రూపాలు తయారు చేయించి వాటి ద్వారా విద్యాబోధన చేయటం సులభమన్నారు. అనంతరం విద్యార్థులతో ఉపాధ్యాయులు భాషా, గణితం నేర్పడంలో అనుకూలమైన అభ్యసన వాతావరణాన్ని కృషి చేసి ఫలితాలు సాధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పునాది అభ్యసనా నైపుణ్యాలు సాధించేలా, విద్యార్థులకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలన్నారు.



తూబాడు పాఠశాలలో నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణనిస్తున్న ఉపాధ్యాయుడు



సాతులూరు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులతో ఉపాధ్యాయిని



చిరుమామిళ్ళ ప్రాథమిక పాఠశాలలో..

అన్నా క్యాంటీన్లకు మరమ్మతు

15న మూడు క్యాంటీన్ల ప్రారంభానికి సన్నాహాలు



క్యాంటీన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి బయటకు వస్తున్న కమిషనరు

నరసరావుపేట: పట్టణంలో మూడు అన్నా క్యాంటీన్ల పున ప్రారంభానికి మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు రూ.31.5 లక్షల వ్యయంతో చేపట్టిన ఆధునీకీకరణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి, డీఇ ఓలేటి శ్రీనివాసరావు పరిశీలించారు. సంబందిత కాంట్రాక్టర్‌కు జరుగుతున్న పనులపై మార్పులు, చేర్పులు సూచించారు.
ఈసందర్భంగా కమిషనరు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ సెంటర్, సత్తెనపల్లిరోడ్డు స్టేడియం, పెద్దచెరువు బైపాస్ రోడ్డు కూడలిలో నిర్మించి ఉన్న అన్నా క్యాంటీన్ల భవనాలకు మరమ్మతులు, అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని వచ్చే నెల రెండోతేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీన అన్నా క్యాంటీన్లను ప్రారంభిస్తామని ప్రకటించిందన్నారు. ఆ మూడు భవనాల చుట్టు ప్రక్కల ఉన్న పరిసరాలను శుభ్రం చేస్తున్నామన్నారు. ఆయనతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు అమ్మినా, కొన్నా నేరమే



మాట్లాడుతున్న కమిషనర్ సీహెచ్ గోవిందరావు

చిలకలూరిపేట: టిడ్కో గృహాలు అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, అర్బన్ సీఐ పి.రమేష్‌లు తెలిపారు. మున్సిపల్, పోలీసు అధికారులు టిడ్కో గృహ సముదాయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పలువురు లబ్ధిదారులు టిడ్కో గృహాలను విక్రయిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. టిడ్కో గృహ సముదాయంలోని 300 చదరపు అడుగులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఎవరికీ ఇవ్వలేదని, అవి మొత్తం పురపాలక సంఘ కార్యాలయంలోనే ఉన్నాయని వెల్లడించారు. కొంతమంది వడ్డీ వ్యాపారులు గృహాల లబ్ధిదారులకు రుణాలు ఇచ్చి వాటికి బదులుగా గృహాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. అనధికారికంగా జరుగుతున్న కొనుగోళ్లు, విక్రయాలు చెల్లవని హెచ్చరించారు. ఎవరైనా లబ్ధిదారులు గృహాలను అమ్మినట్లు తమ దృష్టికి వస్తే అవి స్వాధీనం చేసుకొని అర్హులైన కొత్త లబ్ధిదారులకు ఇస్తామని తెలిపారు. ఎవరికి కేటాయించిన ఇళ్లలో వారే ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఐ పుల్లారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడులో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం, పోలీసు సిబ్బంది


యడ్లపాడు: ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పోలీసు స్టేషన్ వెనుక ఉన్న ఇంట్లో దేరంగుల శివయ్య, దేవి దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం దంపతులు కూలి పనులకు వెళ్లారు. వారి కుమార్తె కళాశాలకు వెళ్లింది. వారి కుమారుడు చివరిగా ఇంటి నుంచి బయటకు వెళుతూ ఇంటి తాళం వేయడం మరిచిపోయాడు. మధ్యాహ్నం సమయంలో కుమారుడు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి.
ఇంటి లోపల బీరువా పగులగొట్టి ఉంది. అందులోని సుమారు ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, రూ. 30 వేలు నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందిన నిర్ధారించుకుని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యకు అరకొర నిధులు దారుణం

యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయింపు నిరాశాజనకంగా ఉన్నాయని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జీ.వి జయసారథి పేర్కొన్నారు. బడ్జెట్‌పై వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో ఆరుశాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 3.5 శాతం నిధులే కేటాయించటం చూస్తుంటే విద్యా రంగంపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలియచేస్తుందన్నారు. వేతన జీవులకు పాత పన్నుల విధానంలో మార్పులు ఆశిస్తే నూతన పన్నుల విధానంలో మార్పులు చేయటం ఏమాత్రం ఉపయోగకరం కాదన్నారు. సీపీఎస్ విధానం గురించి ఏమాత్రం మాట్లాడకపోవటంతో ఎదురు చూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశను మిగిల్చిందన్నారు.

విద్యార్థులకు మేలు చేసేలా వ్యవహరించాలి



చేజర్ల ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నకరికల్లు: విద్యార్థులపరంగా అభ్యసనం, అభివృద్ధి లక్ష్యాలుగా పాఠశాలలో ఉపాధ్యాయులు పనిచేయాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఎస్.లలిత సూచించారు. జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేజర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం భాషా గణితంలో పునాది అభ్యసనా సంకల్పయాత్ర నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులందరూ పునాది అభ్యసనా నైపుణ్యాలను సాధించేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులందరూ కలసి కట్టుగా పనిచేయాలన్నారు. పిల్లలకు అనుభవాలతో కూడిన అభ్యసనను అందించాలని సూచించారు. వారు తమ భాషను స్వేచ్ఛగా ఉపయోగించుకునేలా, నిర్భయంగా ప్రశ్నలు అడిగేలా అవగాహన కల్పించాలన్నారు. ఆనందానికి, గౌరవానికి అత్యంత అనుకూలమైన ప్రదేశంగా పాఠశాలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పఠాన్ మల్లిక, చెరుకూరి వెంకటేశ్వర్లు, గేరా మోహన్‌రావు, ఏసీహెచ్.వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్.గౌస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంకురాత్రిపాడులో ఆధార్ సేవలు

నాదెండ్ల: సంకురాత్రిపాడు సచివాలయంలో మంగళవారం ఆధార్ వెరిఫికేషన్ సెంటర్ ప్రారంభమైంది. సర్పంచ్ జెట్టి నాగమణి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణలు కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా కేవలం 37 ఆధార్ కార్డులు మాత్రమే సవరణలు చేశారు. బుధవారం గొరిజవోలు సచివాలయంలో ఆధార్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ప్రతిరోజూ కనీసం వంద ఆధార్ కార్డులు వెరిఫికేషన్ లక్ష్యంకాగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా 37 కార్డులు మాత్రమే చేయగలిగామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెట్టి బొల్లయ్య, మురుకుట్ల సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తురిమెళ్లలో ఆధార్ అప్‌డేషన్ క్యాంప్

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో ఆధార్ అప్‌డేషన్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఎండీవో లక్ష్మీ కుమారి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జంగాలపల్లెలో ఆవులు, గేదెలపై పిచ్చికుక్క దాడి



నాదెండ్ల: జంగాలపల్లె గ్రామంలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి గ్రామస్తులను భయాందోళనలకు గురి చేసింది. నాలుగు గేదెలు, ఐదు ఆవులను కరిచి గాయపరిచింది. దీంతో గ్రామస్తులు నాదెండ్ల పశువైద్యాధికారికి సమాచారమిచ్చారు. స్పందించిన డాక్టర్ ఏడుకొండలు తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని కుక్కకాటుకు గురైన ఆవులు, గేదెలకు చికిత్స చేశారు. రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ కుక్కల బెడద ఎక్కువగా ఉందని, గతంలో కూడా మనుషులు, పశువులను కరిచాయని వాపోయారు. కుక్కల బెడద నివారించాలని పంచాయతీ అధికారులను వేడుకుంటున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు వద్ద సమాచారం కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు యువతి తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం యువతికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. దీంతో బాలిక మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. యువతి తల్లిదండ్రులు బాలిక కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం వెతకగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శామ్యూల్ రాజీవ్‌కుమార్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ పంటలతో ఎన్నో లాభాలు



రాజుపాలెం: పత్తి పంటలో అంతరంగా గోరు చిక్కుడు, పెసర, సజ్జ, బొబ్బర్లు, చెట్టు చిక్కుడు, కంది వేయడం వల్ల ప్రధాన పంటను తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, పిండి, నల్లి, గులాబీ రంగు పురుగుల నుంచి కాపాడుకోవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. అంతర పంటల వల్ల మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుందని, దీని వల్ల చీడపీడలు ఆశించవని తెలిపారు. ద్విదళ, ఏకదళ జాతి కారణంగా భూమి సారవంతం అవుతుందని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలు వేసుకోవడం వల్ల ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎఫ్ఎఫ్ మల్లికార్జునరావు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు



చిరుమామిళ్లలో పత్తిపొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

నరసరావుపేట రూరల్: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమీ) డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మీ, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ) డాక్టర్ వెంకటరాములు తెలిపారు. మండలంలోని కేతముక్కల అగ్రహారంలో అధిక వర్షాలకు గురైన పత్తి పంటను వ్యవసాయాధికారులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు పత్తిపంట దెబ్బతినకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. పొలంలో నిలిచిన నీటిని కాలువలు చేసి బయటకు పంపాలని తెలిపారు. పొటాషియం నైట్రేట్‌ను వారం రోజుల వ్యవధిలో పత్తి పంటపై పిచికారీ చేయాలన్నారు. కొంచెం తేమ ఆరిన తరువాత ఒక ఎకరాకు 50 కిలోల డీఏపీ, 50 కిలోల యూరియ, 25 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలంలో వేద పెట్టాలని సూచించారు. రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, పేనుబంక నివారణకు కాండానికి మందు పూసే పద్ధతిలో మోనోక్రోటోఫాస్ 100 మిల్లీలీటర్ల మందును 400 మి.లీ నీటితో కలిపిన మందు ద్రావణాన్ని పత్తి మొక్కల కాండం మధ్యభాగంలో బొట్టు పెట్టుకుంటూ పోవాలని తెలిపారు. ఈ పద్ధతిని పత్తి నాటిన 30 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు పాటించాలని తెలియజేశారు. కాండానికి మందు పూసే పద్ధతి పాటించనిచో ఆకులకు రెండు పచ్చపురుగులు దాటిన యెడల రీజెంట్ 2 మి.లీ, ఉలాల 0.3 గ్రాముల లీటరు నీటిని కలిపి కలుపుకొని ఉధృతిని బట్టి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పి.మస్తానమ్మ, వ్యవసాయాధికారులు వి.నరేంద్ర బాబు, ఎ.హరిప్రసాద్, సరిత, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పూత మందుతో రసం పీల్చే పురుగు నివారణ

నాదెండ్ల: పత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు 20–40–60 రోజుల వ్యవధిలో మోనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తిలో కాండపూత మందుతో నివారించుకోవచ్చని ఏరువాక ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఎం.నగేష్ చెప్పారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలోని తాడిపత్రి వెంకటరెడ్డి పత్తి పొలాన్ని మంగళవారం ఏరువాక శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల బృందం సభ్యులు పరిశీలించారు. అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూత, పిందె రాలకుండా ఉండేందుకు 40–60–80 రోజుల కాల వ్యవధిలో లీటర్ నీటికి 1.5 శాతం బోరాన్ పిచికారీ చేయాలని లాంఫాం ఏరువాక శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు చెప్పారు. రైతులు తప్పనిసరిగా పూతదశలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని గులాబీరంగు పురుగు ఉధృతిని గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటిస్తే గులాబీరంగు పురుగు నివారించుకోవచ్చన్నారు.
ఏరువాక విస్తరణ శాస్త్రవేత్త వెంకట రాములు మాట్లాడుతూ పత్తిలో స్వల్పకాలిక పంటలైన పెసర, కొర్ర, మినుము రకాలను అంతర్ పంటలుగా సాగు చేసుకున్నట్లయితే ఆర్థికంగా లాభదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, స్థానిక ఏవో హరిప్రసాద్, గ్రామ ఉద్యానవన సహాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

సీడీపీఓ అనూరాధ

శావల్యాపురం: 0–6 సంవత్సరాలలోపు చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరి అని సీడీపీఓ ముదివర్తి అనూరాధ కోరారు. మండలంలోని పిచికలపాలెం గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కార్యక్రమన్ని మంగళవారం పరిశీలించారు. సీడీపీఓ మాట్లాడుతూ వినుకొండ రూరల్, అర్బన్, నూజెండ్ల, శావల్యాపురం క్లస్టర పరిధిలో 258 చిన్నారుల ఆధార్ నమోదు చేయాల్సి ఉందని గుర్తించినట్లు చెప్పారు. ఆధార్ నమోదు కాకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు వర్తించవని పేర్కొన్నారు. శిశువు జన్మించగానే జనన ధ్రువీకరణ పత్రాన్ని వైద్యాధికారులు వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అందజేస్తారన్నారు. జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఆధార్ నమోదు కార్యక్రమం సులువుగా జరుగుతుందని వివరించారు. అలాగే మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో కిశోర బాలికలు, బాలురు సారథ్యంలో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత ఉన్నారు.

ప్రజా రవాణ మరింత పటిష్టం చేస్తాం

మూడు ఆర్టీసీ బస్సుల్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట: ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కూటం ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు నూతనంగా సమకూర్చిన మూడు ఆర్టీసీ బస్సులను మంగళవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రవాణాకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించబోతున్నామని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఆర్ఎం ఎన్.వీ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి, టీడీపీ నాయకులు విశ్వేశ్వరరావు, కన్యాదార రాజు, మాబు, బాలు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఊరుకోం

అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి

శావల్యాపురం: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామం ఎస్సీ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులతో పోలీసు నిబంధనలు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరు చదువుకుని మంచి జీవితం కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. యువత రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గొడవలు, అల్లర్లుకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటు వినియోగించుకోవటం ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కు అని రాజకీయ గొడవలకు, అల్లర్లుకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా భావించాలన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్సై చల్లా సురేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలు.. వణుకుతున్న రైతన్నలు



పెదకూరపాడు: ఖరీఫ్ సీజన్ మొదలైంది.... అన్నదాతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట పొలాల్లోనే ఉంటారు. నిత్యం ఏదో పని చేస్తూ అక్కడే ఉండాల్సిన పరిస్థితి. వర్షాకాలం, ఈదురుగాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, తీగలతో ఎప్పుడు ఎటు నుంచి ప్రమాదం వస్తుందోనని అన్నదాతలు వణుకుతున్నారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉండటమే దీనికి కారణం. వర్షాలకు, గాలులకు కొన్ని ఒరిగి, మరి కొన్ని దాదాపు నేలపై వాలిపోయాయి. తీగలు చేతులకు అందేస్థాయిలో దర్శనం ఇస్తున్నాయి. దీంతో రైతులు, రైతు కూలీలు భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.